# గుండెలలో నెలకొన్న...

-జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

వసంతం కోసం వేచి ఉన్న కోయిలలా...

స్వాతి చినుకు కోసం పడిగాపులు కాస్తున్న ముత్యపు చిప్పలా...

బస్సుకోసం ఎదురు చూస్తున్నాడు భాస్కరం!

రోడ్డు మీద వస్తున్న ప్రతి బస్సూ ఊరిస్తుంది. తీరా దగ్గరకొచ్చాక కళ్లలో దుమ్ముకొట్టిపోతుంది.

వేగంగా వచ్చి స్టేజికి అర ఫర్లాంగు దూరంలో ఆగింది బస్సు. ఒండ్రపెడుతూ నిలబడిన బస్సు దగ్గరకి పరిగెత్తు కుంటూ వెళ్లి ఎక్కేసరికే కదిలిపోయింది. బస్సులో జనం పలచగా ఉన్నారు. బస్సంతా కలియజూ శాడు. ప్రయోజనం శూన్యం. వెంటనే దిగిపోయే ప్రయత్నం చేశాడు. కానీ, అప్పటికే బస్సు స్పీడందు కుంది.

నీరసంగా తరువాతి స్టేజిలో దిగిపోయాడు.

ఈరోజు...దాటిపోతే రేపే ఆఖరు!

రేపటి తేజోమయమైన ఉదయానికి నేటి నుంచే సన్నాహాలు ప్రారంభించాలి. మించిపోతే సమయం మళ్లీ తిరిగిరాదు.

కరిగిపోతున్న కాలం గుండెల్లో సూదులు గుచ్చుతూ ఉండగా అసహనంతో ఇంకో బస్సుకోసం ఎదురు చూస్తూ నిలబడ్డాడు. ఎదురుచూపులు కొన్ని సందర్భాలలో మధురానుభూతులు మిగిలిపోవచ్చు కానీ ఎల్లవేళలా కాదు.

మరి కొంతసేపటికి ఇంకో బస్సు వచ్చింది. సరిగ్గా స్టేజి దగ్గరే ఆగింది. బస్సులో జనం బాగానే ఉన్నారు. ఆత్రంగా బస్సులో దూరిపో యాడు భాస్కరం. నిలబడి ప్రయాణం చేస్తున్నవాళ్లని తప్పించుకుంటూ..సీట్లలో సెటిలయి ఉన్నవారిని పరిశీలించుకుంటూ.. ముందువరకూ దూసుకువచ్చేశాడు. డ్రైవరు వెనుక సీట్లో ఉన్నవారిని చూడగానే సూర్యదర్శనం చేసుకున్న కమలంలా విరిసిందతని ముఖం. అంతవరకూ అతడిని ఆవరించుకుని ఉన్న అశాంతి, అసహనం పటాపంచలైపోయాయి.

తల వంచుకుని చదువుకుంటున్న ఆమెను చూశాక, దిగంతాల వరకూ వ్యాపించి ఉండే వెలుగు అతని కన్నుల్లో ప్రతిఫలించింది.

''ఎక్స్‌క్యూజ్ మి, చిన్నీ...'' అన్న అభ్యర్ధనా పూర్వకమైన పలకరింపు వినగానే చిరునవ్వుతో పక్కకు జరిగి అతనికి చోటు ఇచ్చింది.

''థాంక్యూ'' అంటూ కొద్దిపాటి స్థలంలోనే సర్దుకుని కూర్చున్నాడు.

''యు ఆర్ వెల్‌కమ్'' అన్న ఆమె ప్రత్యభివందనాన్ని అందుకుంటున్నప్పుడు అతని మనసు నందనానంద వనమైంది.

ఏదో చెప్పాలన్న ఆరాటం. ఏమీ చెప్పలేని మొహమాటం. ఈరెంటి మధ్యా ఊగిసలాడి, చివరకు మొహమాటాన్ని జయించి ధైర్యం చేశాడు. గుసగుసగా పిలిచాడు, ''చిన్నీ''

''ఊ!'' అంది శృతిచేయబడుతున్న వీణియ.

''నీతో మాట్లాడాలి''

''ఇప్పుడు చేస్తున్నదేమిటో!'' చిలిపితనం రంగరించి న వెక్కిరింత

''ఇలా కాదు''

''ఇంకెలా?'' చిరునవ్వు చిక్కబడుతోంది.

అవును. ఇంకెలా? తనకీ అనుమానం వచ్చేసి తడబడిపోయాడు. ఎలాగో ఒక లాగ తను చెప్పాలను కున్నది చెప్పెయ్యాలి. అటు చూస్తే బస్సు గమ్యానికి చేరువైపోతోంది. ఈలోగా దక్కిన కొద్దిపాటి సమయాన్నీ సద్వినియోగం చేసుకోవాలన్న ఆతృతతో అనేశాడు ''ఇక్కడ కాదు''

చిక్కపడుతున్న నువ్వు ఘనీభవించింది. శంకాస్ప దమైన మనోయవనికలు చూపులను కమ్ముకుంటూ ఉండగా అంది!''ఇంకెక్కడో!''

చేసిన తప్పే చేశాడు. అనాలోచితంగా నోరుజారినం దుకు తనను తనే శపించుకుంటూ ఉండిపోయాడు. ఏం సమాధానం చెప్పాలో తెలియక మౌనాన్ని ఆశ్రయిం చాడు. ఆమెచేతిలోని పుస్తకాన్ని పరిశీలించడంలో నిమగ్నమైపోయాడు.

అతని కన్నుల్లో ఏదో చెప్పాలన్న తపన.

చెప్పలేకపోతున్న సందిగ్ధం...

అవగతమై, అతని సంకోచాన్ని నివారించడానికా అన్నట్లు మాటలు కలిపింది. ''చెప్పండి''

అతని ఆలోచనలు అంతరించిపోయాయి. గొంతు సవరించుకున్నాడు. ''నేను చెప్పాలనుకున్నది నువ్వు 'చెప్పండి' అన్నంత సులభంగా చెప్పగలిగేది కాదు. అందుకే, నీతో ఏకాంతంగా ప్రశాంత వాతావరణంలో మాట్లాడాలనుకుంటున్నాను. రేపటితో నీ పరీక్షలు అయిపోతాయి. ఆ తరువాత మళ్లీ నిన్ను చూడటం, నీతో మాట్లాడటం వీలుపడక పోవచ్చును. ప్లీజ్, అర్థం చేసుకో...''

ఇదేమి పిచ్చితనం? ఇదెలాంటి ఉన్మాదం? తనెవరు? అతనెవరు? తనకీ అతనికీ మధ్య ఏకాంత చర్చలేముంటాయి?

తల నిలువుగా ఊపుతూ అడిగింది. ''ఏమిటి అంత అర్ధం చేసుకోవలసింది?''

ఆమె భావాన్ని అర్థం చేసుకున్న అతని ముఖం వివర్ణమైంది. మళ్లీ మాటలు కలపడం ఎలాగో తెలియక, మాట్లాడే అవకాశం కోసం నిరీక్షిస్తూ ఉండిపోయాడు. దిగవలసిన స్టేజి దగ్గర పడింది.

''చిన్నీ, నువ్వెలా భావించినా బాధపడను. నన్నెలా అర్ధం చేసుకున్నా చింతించను. కానీ నువ్వు రావాలి. నీతో మాట్లాడాలి. నీకోసం ఎదురుచూస్తూ ఉంటాను. పరీక్ష రాయడం అయిపోగానే వెళ్లిపోకు. దయచేసి నా కోసం పదినిముషాలు కేటాయించు. ఇంతకు మించి ఏం చెప్పడానికీ ఇది తగిన ప్రదేశమూ కాదు. చాలినంత సమయమూ లేదు. ''అభ్యర్ధనా పూర్వకంగా చెప్పేసి బస్సు ఆగీ ఆగడంతోనే లేచాడు. బస్సు దిగుతూ ఉండగా మరోసారి గుర్తు చేశాడు భాస్కరం.

ఆమె పట్టించుకోకుండా వెళ్లి స్నేహితురాళ్లతో కలిసిపోయింది.

ఆమెను గమనిస్తూనే ఉన్నాడు భాస్కరం.

పరీక్ష హాల్లోకి వెళ్లబోతూ...కాలేజీ బయట రోడ్డుకి అవతలి వైపున ఉన్న కిళ్లీ కొట్టు దగ్గర నిలబడి సిగరెట్టు ముట్టించుకుంటున్న భాస్కరం వంక చూసిందామె. అలా చూస్తూ అసంకల్పితంగానే చిరునవ్వు నవ్వింది.

ఆ చిరునవ్వు నింపిన చైతన్యాన్ని హృదయంలో పదిలపరుచుకుని అక్కడి నించీ కదిలాడు.

★★★

పరీక్ష హాలులోంచీ బయటకు వచ్చింది జ్యోతి.

వస్తూనే యథాలాపంగా కిల్లీ కొట్టు వంక చూసింది.

భాస్కరం అక్కడే నిలబడి ఉన్నాడు.

అతడిని అక్కడ చూడగానే ఆమె కన్నుల్లో కించిత్ గర్వంతో కూడిన వెలుగు రేఖ విరిసింది.

ఒక పక్క స్నేహితురాళ్లతో మాట్లాడుతూనే మధ్య మధ్య దృష్టిని భాస్కరం వైపు ప్రసరింపజేస్తోంది.

ఆమె వీక్షణ పంక్తుల్లో ఉన్నంతసేపూ మెరుస్తున్నాడు భాస్కరం. మెరుస్తూ మురుస్తున్నాడు.

ఆమె, స్నేహితురాళ్లను తప్పించుకుంటూ ముందుకి వస్తోంది.

తన మాటను మన్నించి తనవైపుకు వస్తున్న జ్యోతి వంక కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ అటువైపు అడుగులు వేస్తున్నాడు భాస్కరం. ఏదో అదృశ్య రాక్షస హస్తం పట్టి నిలిపేసినట్లుగా ఆగిపోయాడు.

ఈమధ్యలో ఎవరో లెక్చరర్ ఆమెకు ఎదురుపడ్డాడు. ఆయనతో మాట్లాడటానికే ఆమె వస్తూ ఉందని తెలిసి స్థాణువయ్యాడు.

అంతలోనే ఆమె స్నేహితురాళ్లు వచ్చి కలిశారు.

అయినా ఆమె తన కోసం వస్తుందన్న ఆశ చావలేదు.

ఆశ, నిరాశల మధ్య ఊగిసలాటలో కరిగిపోయిన కాలం, స్నేహితురాళ్లతో కలసి వెళ్లిపోతున్న జ్యోతి స్వరూపాన్ని ప్రత్యక్షీకరిస్తోంది.

అయిపోయింది. వెళ్లిపోతోంది. అతడిని అంధకారంలో వదిలేసి మరో ప్రపంచానికి వెలుగునివ్వడానికా అన్నట్లు వెళ్లిపోతోంది జ్యోతి.

తిమిరంతో అనంతమైన సమరం సాగిస్తూ నడి రోడ్డు మీద నిలబడిపోయాడు భాస్కరం.

వెన్నెలను అన్వేషిస్తూ చందమామ వరకూ ప్రస్థానించినా ఆ వెన్నెల ఆ చూకీ దొరకనప్పుడు కలిగే క్షోభ అతని ముఖంలో ప్రతిబింబిస్తోంది.

నిర్వికారంగా రోడ్డు మీద మిగిలిపోయాడు.

జ్యోతి తన దారిన తను వెళ్లిపోతూ చివరి సారిగా తలతిప్పి వెనక్కి చూసింది. ఆమె ప్రయ త్నం ఎంతమాత్రం లేకుండానే అతని రూపం ఆమె హృదయంపై ము ద్రించబడిపోయింది.





★★★

''హమ్ ప్యార్‌మే జలనే వాలోం కో..చైన్ కహా? హాయ్ ఆరామ్ కహా..?'' దూరాన్నుండీ వినిపిస్తున్న పాట ఆమె దృష్టిని, చదువు తున్న పుస్తకం మీద నిలవని వ్వ డం లేదు.

వింటున్న కొద్దీ మనసు ని కట్టేస్తోంది. హృదయాన్ని పిండేస్తోంది.

క్రమక్రమంగా భార యుతం అవుతున్న అంత రంగం...,

'బే చయన్' అన్న పదానికి నిలువెత్తు భా ష్యం లా..

దారి కనుక్కో-లేని బాటసారిలా..

రగులుతున్న జ్వాల లా...

రోడ్డు మధ్యన చేష్టలుడిగి నిలబడిపోయిన భాస్కరాన్ని రెటీనాపైకి ఫోకస్ చేస్తోంది.

నెమ్మది నెమ్మదిగా పుస్తకంలోని అక్షరాలు మాయమయ్యాయి. ఆ స్థానాన్ని భాస్కరం ముఖం ఆక్రమించింది.

భాస్కరం....అతని ముఖం, ఆ ముఖంలో కళ్లు...ఆ కళ్లలో అలవికాని వెలితి!

నీరు ఇంకిపోయిన బావుల్లాగా..చైతన్య రహితంగా; జీవం లేని కట్టెకు చూపు వచ్చినట్టుగా...నిస్తేజంగా కనిపిస్తున్నాయి.

ప్రపంచంలోని దైన్యాన్నంతా నింపుకొని.., సృష్టిలోని

శోకాన్నంతా వంపుకొని, గుండెల్ని మండిస్తున్నాయా చూపులు.

తన రంగుల రంగరింపుతో ప్రకృతిని సజీవంగా కాన్వాసుపైకి ఎక్కించగల సౌందర్య పిపాసి చూపులా అవి?

దృశ్యాదృశ్యంగానే అయినా మనో ఫలకంపై చెరగని ముద్రలు వేసే కలల్ని సైతం మనోహరంగా చిత్రించగల స్వాప్నికుని చూపులేనా అవి? వర్ణార్ణవంలో ఈదులాడు తూ పదాల్ని పాదాక్రాంతం చేసుకుని పదబంధాల చేత దాస్యం చేయించుకుంటూ ఎంతటి క్లిష్టమయిన భావాన్నైనా అలవోకగా భాషలోకి అనువ దిం చగల శబ్ద మాంత్రికుని చూపులు ఇవేనా? ఇవేనా??

ఈ చూపుల అర్థం ఏమిటి? వాటి అంతరార్థం ఏమై ఉంటుంది? ఏ పరమా ర్థాన్ని సూచిస్తున్నాయి? అవి తననే ఎందుకు వెంటాడుతున్నాయి? తనలో దేనిని వేటాడుతున్నాయి?

సాధారణంగా కవులూ చిత్రకారులూ నటులూ వంటి కళాకారులంతా తమ సర్వస్వాన్నీ కళకే అంకితం చేసి లోకం దృష్టిలో పిచ్చివాళ్ళుగా స్థిరపడతారు.

ఇదీ ఒక రకం పిచ్చేనా? అతని చూపులూ ఆ కోవకు చెందినవేనా? అతని ఉన్మత్తతకు ప్రేరణ తానేనా? ఎలా?

భాస్కరం తనకు కొత్తవాడు కాదు.

అతని నూనూగు మీసాలూ...

వచ్చీరాని గెడ్డం...

కొత్తకొత్త చిత్త చాంచల్యాలు రేకెత్తించే యవ్వనం..

అన్నీ తనకి ఇంకా గుర్తే.

ఇంతకాలంగా చూసిన భాస్కరం కాదు..


రూపెత్తిన విషాదంలా..సర్వస్వాన్నీ కోల్పోయిన చక్రవర్తిలా..మండుతున్న అగ్నిగోళం లాంటి భాస్కరం ఈనాడు కొత్తగా గోచరించాడు.

తానతని అభ్యర్థనని అంత నిష్కర్షగా తోసి పుచ్చకుండా ఉండాల్సింది.

అతనికీ నాన్నకీ ఎన్ని గొడవలయినా ఉండచ్చు. ఎన్నిసార్లయినా తగాదాలు పడి ఉండవచ్చు. అది వారి వ్యక్తిగతాలు. వాటితో తనకేమిటి సంబంధం?

తనెప్పుడూ అతను ఆప్యాయంగానే పలక రించాడు కానీ అసభ్యంగా కాదే! ఆత్మీయంగానే మాట్లాడాడు కానీ పెడ ర్థాలు ధ్వనింప జెయ్యలేదే! మరి, తానతని అభ్యర్థనని ఎందు కంత నిర్దాక్షిణ్యంగా తిరస్కరించింది?

నిజమే, కనిపించినప్పుడల్లా తనవంక ఆశగా చూస్తాడు. దేనికోసమో తనలో వెతుక్కుం టున్నట్లుగా కనిపిస్తాడు. ఎందు కోసం తనని అంతగా శోధిస్తున్నాడో తెలుసుకోకపోవచ్చు. కానీ, తెలుసుకో వాలని ఎన్నిసార్లు అనిపించ లేదు?




ఎప్పుడు చూసినా తనకోసమే ఎదురు చూస్తూ కనిపిస్తాడు.

ఏం, తనకి మాత్రం? అతడు రోజూ కనపడే చోట ఏనాడైనా కనపడకపోతే వెలితిగా అనిపించేది కాదూ? ఆ రోజంతా ఏదో తెలియని అసంతృప్తితో కరిగిపోయేది కాదూ?

రేపటితో పరీక్షలు అయిపోతాయి. తానింక అతనికి రోజూ ఎప్పటిలాగా కనపడదు. అదీ కాక, ఇంకా పెళ్ళి వయసు రాలేదని మొత్తుకుంటున్నా వినకుండా పెళ్ళి నిశ్చయం చేశారు నాన్న.

ఆ ముచ్చట కూడా తీరిపోతే తానింక అతనికి తారస పడటం దాదాపు అసంభవం.

ఈ విషయాలన్నీ అతనికీ తెలుసు.

అందుకే అతను తొందర పడ్డాడు.

అందులో తప్పు ఏముంది?

అతను చెప్పేదేమిటో విన్నంత మాత్రాన కలిగే నష్టం ఏముంది?

ఇంతకీ అతను మాట్లాడతానన్నది దేని గురించి అయి ఉంటుంది?

తనతో మాట్లాడక తప్పని ఆ విషయం ఏమైఉంటుంది?

మళ్ళీ ఆ పాట చెవుల్లో ప్రతి ధ్వనిం చింది.

''హమ్ ప్యార్ మె...జల్‌నే వాలో కో..''

అంటే...?

అతడు, ప్రేమలో దహించుకుని పోతున్నాడా?

ఆ చూపులు ప్రేమ సందేశాన్ని మోసుకువస్తున్నాయా?

ప్రేమ మనిషినీ..మనసునీ..ఇంతగా జ్వలింపజేస్తుందా?

ఏకంగా మనిషిని పిచ్చిదానిగా మార్చే స్తుందా?

ఇందుకేనా అతడు తన స్థాయిని విస్మరించి, యుక్తాయుక్త వివక్షణ మరచి, ఒక సాధారణ రోడ్ రోమియోలాగా తన వెంట పడింది? అలా వెంటపడటం చిన్నతనంగా అతనికి అనిపించకపోవడానికి గల కారణం ఈ ప్రేమేనా?

అతని నూనూగు మీసాల వయసులో అతను రాసి ఇచ్చిన దేశభక్తి గీతాన్ని తను పాడి ప్రథమ బహుమతి పొందినప్పుడు అతను బుగ్గమీద ముద్దుపెట్టుకోవడం గుర్తు వచ్చింది. అది వాత్సల్యం కాదా?

ఏడవ తరగతిలో డిస్టింక్షన్ తెచ్చుకున్నప్పుడు నుదుటిపై చుంబించాడు. అది ఆప్యాయత కాదా?

తను అనారోగ్యంతో మంచం మీద మూసిన కన్ను తెరవకుండా పడి ఉన్నప్పుడు, తను త్వరగా కోలుకోవాలని అమ్మవారి గుడిలో పూజలు జరిపించి, పూలు ప్రసాదం తెచ్చాడు. అమ్మా నాన్నా మాట్లాడరని తెలిసి కూడా చూడటానికి వచ్చి నొసటన కుంకుమ దిద్దాడు. అది అభిమానం కాదా?

ఇంటర్ ఫస్టక్లాస్‌లో పాసయినప్పుడు, భార్యతో సహా వచ్చి తన శ్రీమతిని పరిచయం చేశాక కంగ్రాచ్యులేట్ చేస్తూ ఇచ్చిన షేక్ హ్యాండ్...అభినందన కాదా?

వీటన్నింటిలోనూ ప్రసరించిందే మిటి? ప్రేమానా?

వాత్సల్యం, అనురాగం, ఆప్యాయ త, అభిమానం ఇవన్నీ ప్రేమ యొక్క ప్రతిరూపాలేనా? అయితే అతను కనిపిం చనప్పుడు అనిపించే వెలితీ, అసంతృప్తీ ఇవి కూడా ప్రేమసాగరంతో సంగమించే జీవ నదులేనా?

తన్మయంగా చెంప సవరించు కుంది. బుగ్గపై అతని పెదవులు దేనికోసమో తడుము తున్నట్లనిపిం చింది. ఇప్పుడిప్పుడే మళ్ళీ ఆ స్పర్శ జీవం పోసుకుంటున్న అనుభవం మైమరపింప చేసింది. చెక్కిళ్ళు రాగరంజితాలై

## చాన్స్ కొట్టేసిన మనీషా



కరిష్మాకపూర్ అమాంతం తన రెమ్యునరేషన్ పెంచేయడంతో నిర్మాతలు బెంబేలుపడడం ఇతర హీరోయిన్లు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోడం జరిగిపోతోంది. ఈ నేపథ్యంలో 'బీవీ నెం.1' సినిమాలో కరిష్మా స్థానాన్ని మనీషా కొయిరాలా కొట్టేసింది. తన ప్రతి చిత్రంలో కరిష్మానే ఎక్కువగా ప్రిఫర్ చేసే దర్శకుడు డేవిడ్ ధవన్ ఈ సినిమాలో కరిష్మాను తొలగించి మనీషాను పెట్టడం గురించి తనను తాను సమర్థించుకుంటూ 'అనిల్ కపూర్ భార్యగా కరిష్మా మరీ చిన్న పిల్లలా కనిపిస్తుంది. వాళ్ళ జోడీ అంతగా బాగుండదనే ఇలా మార్పు చేయడం జరిగింది' అన్నాడు. అన్నట్టు ఈ చిత్రంలో నటిస్తున్న మనీషా తన పారితోషికాన్ని సూనికి సగం తగ్గించుకున్నదని వినికిడి.

-జె.వి.బాబు

శోభిల్లాయి. నుదుటిపై అతని ఆనవాళ్లు సింధూరంలా మెరిశాయి. చేతులు ఎందుకో హరి చందనపు పరిమళంతో గుబాళిస్తున్నాయి.

ఇది ప్రేమేనా? ఇదేనా ప్రేమంటే? ప్రేమ ఇంత మధురంగా ఉంటుందా?

రేపు పరీక్ష అయిపోయాక శైలజ, వాళ్ల ఇంటికి ఆహ్వానించింది.

శైలజా వాళ్ల అన్నయ్యా భాస్కర మూ మంచి స్నేహితులు.

వాళ్ళ అమ్మా నాన్నా ఊళ్లో లేరు. అన్నయ్య మధ్యాహ్నం ఇంటి దగ్గర ఉండడు. శైలజ ఒక్కతే ఉంటానంది. నిజంగా ఆమె ఒక్కతే ఉంటుందా లేక భాస్కరం ప్రోద్బలంతో రమ్మని పిలిచిందా? ఉండే ఉంటుంది. లేకపోతే ఎప్పుడూ లేనిది ఈరోజు మాత్రమే అంత ప్రత్యేకంగా ఎందుకు రమ్మంటుంది?

ఒక వేళ అదే నిజమైతే జరగబోయేదేమిటి?

అతనికీ, తన తల్లిదండ్రులకీ మధ్య గల అగాధాన్ని పూడ్చడానికి తన సహాయం కోరతాడా? ప్రేమ కవిత్వం ఒలికిస్తాడా? హృదయాన్ని తన ముందు పరుస్తాడా?

లేక..?

ఇవేవీ కాక..

అతడు తనను కాక తన శరీరాన్ని కోరతాడా?

ఛ, ఛ! తానెంత పొరపాటుగా ఆలోచిస్తోంది? సామాజిక చైతన్యం లక్ష్యంగా, మానవత్వాన్ని ఆయుధంగా ధరించిన కవీ, అందమైన భార్యతో సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతున్న సంస్కార వంతుడూ అయిన భాస్కరాన్ని గురించా తానిలా ఆలోచిస్తున్నది?

అతని భార్యతో పోలిస్తే తన అందం ఏపాటిది?

ఒకవేళ తనకు కలిగిన ఈ నీచమైన అనుమానమే నిజం అయితే? అతనిలోని విచక్షణ నశించి-సంఘంలో తనకున్న గౌరవాన్ని పణంగా పెట్టి-వ్యక్తిగా తన ఔన్నత్యాన్ని మంట కలిపి-సంస్కారం అన్నమాటనే మలినం చేస్తూ తననే కోరితే? ఏం చెయ్యాలి?

శీలం.


ఈ శీలం అన్నది శరీరానికి సంబంధించి కాక, అతను తన రచనల్లో పదే పదే ప్రస్తావించినట్లు ఆత్మగతమైన పవిత్రతకు చిహ్నమని అతడు విశ్వసిస్తే...ఆ శీలాన్ని అతడు సంరక్షించుకుంటాడు.

అలా జరగకపోతే? అతని నైతిక పతనానికి తను సజీవ సాక్ష్యంలా నిలిచిపోతుంది. అంతే!

అంతే, తను అనుక్షణం అతని మనసును అద్దమై వెన్నాడుతుంది.

ఆమె అంతరంగ సంచలనం ఉపశమించాక మళ్లీ పుస్తకంలో అక్షరాలు ప్రత్యక్షమయ్యాయి.

★★★




పరీక్ష హాలు లోంచీ బయటకు వచ్చింది జ్యోతి. వచ్చీరాగానే భాస్కరం కోసం చుట్టూ కలియజూసింది. కనపడలేదు. రోజూ పొద్దున్నే బస్సులో కనపడేవాడు. ఈరోజు కనపడలేదు.

ఇంకా వెంట పడటం అనవసరం అనుకున్నాడో లేక తను ఊహించినట్లుగా శైలజ వాళ్లింట్లో తారసపడతాడో.

ఇన్నాళ్లూ అతను తనకోసం కాపువేసేవాడు. ఈరోజు? చిత్రంగా తను, అతని కోసం పడి కావలి కాస్తోంది.

ఇంతలోనే శైలజ కూడా పరీక్ష రాసేసి బయటకు వచ్చింది. ఇద్దరూ కలిసి బయలుదేరారు. పది నిముషాలలో శైలజ వాళ్ల ఇల్లు చేరారు.

జ్యోతి అంచనా తప్పు కాలేదు.

భాస్కరం అక్కడే ఉన్నాడు. ఇద్దర్నీ పరీక్ష ఎలా రాశారో కనుక్కున్నాడు. అంత కన్నా ఏం మాట్లాడాలో ఎలా కదిపించాలో తోచనివాడిలా మౌనం వహించాడు. జ్యోతికి కూడా ఏం చెయ్యాలో పాలుపోలేదు.

పరిస్థితి ఇబ్బందికరంగా పరిణమిస్తూ ఉండటాన్ని గ్రహించిన శైలజ ''కూర్చోండి కాఫీ తెస్తాను'' అంటూ కిచెన్‌లోకి దారితీసింది.

పైన సీలింగ్ ఫాన్ తిరుగుతున్న శబ్దం, టేబుల్ మీది టేప్ రికార్డర్ లోంచీ మంద్రంగా వినపడుతున్న సంగీతం, వంట గదిలోంచీ శైలజ చేస్తున్న గిన్నెల చప్పుడు, అంతకుమించి మరోధ్వని లేదు.

పది నిముషాలు మౌనంలో గడిచిపోయాయి.

శైలజ కాఫీలు తెచ్చింది. ముగ్గురూ కాఫీలు తాగాక తన ఉనికి, భాస్కరం, జ్యోతిల ఏకాంతానికి భంగం కలిగించ గలదని గ్రహించిన శైలజ, ''మాట్లాడుతూ ఉండండే జ్యోతీ ఇప్పుడే వస్తాను'' అంటూ ఓ మాట అడ్డం వేసి తప్పించుకుంది.

ఇద్దరే మిగిలారా గదిలో.

జ్యోతి! భాస్కరం! మధ్యలో మౌనం.

రచయితగా ఇలాంటి సన్నివేశాలన్నింటినో సృష్టించాడతను. కానీ, ఇప్పుడు తానే స్వయంగా అలాంటి పరిస్థితుల్లో చిక్కుపడితే ఎలాగా ఏమిచెయ్యాలో తెలియక సతమతమౌతున్నాడు.

నిజంగానే జ్యోతి తన ముందుకు వచ్చి కూర్చోవడం అతనికి ఇంకా ఆశ్చర్యకరంగానే ఉంది. తనకి ఇంత సమీపంలో ఆమె ఉండటం ఇంకా ఓ అద్భుతంలాగే తోస్తోంది. అతని ఆలోచనలనన్నింటినీ ఆనందం ఆక్రమించడం వల్ల ఇంకా తేరుకోలేకపోతున్నాడు.

సమయం మధురంగా కరిగిపోతోంది.

మౌనం!

మాటల్లో వ్యక్తం కాని వేనవేల భావాలు మౌనంలో లయించిపోతున్నాయి. గడిచే ప్రతి క్షణం అనంతమైన అనుభూతుల్ని పంచుతూ నిష్క్రమిస్తోంది. ఫాను శబ్దం కానీ టేప్ రికార్డర్ సంగీతం కానీ ఆ ఇద్దరినీ కదిలించలేక పోతున్నాయి.

మౌనం! మౌనం! మౌనం! యుగాల నిశ్శబ్దాన్ని ఛేదించడానికి సమాయత్తమౌతోంది, భాస్కరం, జ్యోతి, నిశ్శబ్దం-వీటి మధ్య ప్రణవం పురిటినెప్పులు పడుతోంది.

అది, సృష్టికి శ్రీకారం చుట్టనున్న చతురాననుని సమాధి స్థితి ఎంత చైతన్యవంతమైనదో అవగతమౌతున్న తరుణం.

శ్రీః

విధాత సృష్టికి నాంది పలికాడు.

''చిన్నీ!''

అనాది అయిన స్తబ్ధతని వదిల్చి చైతన్యవంతం కావించే ఓంకారంలా వినిపించింది.

జ్యోతి మెల్లగా తల పైకెత్తింది.

అతడు చెప్పాలనుకున్నదంతా గుండె నుండీ గొంతువరకూ ప్రవహించి ఆవిరైపోతోంది.

''ఏదో మాట్లాడతానన్నారు కదా అని

## ఊర్మిళ భజన



రామ్‌గోపాల్‌వర్మ తిరిగి ఊర్మిళ భజన మొదలుపెట్టాడు. 'సత్య' సినిమాలో ఊర్మిళ కాటన్ దుస్తుల్లో కూడా అద్భుతంగా వుందనీ ఆమెది డీ గ్లామర్ కేరక్టర్ అయినప్పటికీ ఆమె అందం ప్రేక్షకులకు మతులు పోయేలా చేస్తుందని అంటున్నాడు. అసలా సినిమాలో ముందు పాటలే వుండకూడదని అనుకున్నాడు వర్మ. కానీ మార్చిన స్క్రిప్ట్‌లో పాటలున్నాయిప్పుడు. అవును మరి, ఊర్మిళని కాటన్ శారీస్‌లో సినిమా చివరిదాకా చూపిస్తే ప్రేక్షకులకు నిరాశే కదా. ఆమె అందాలకు విశ్వరూపం ఇవ్వాలంటే పాటలు కావాలి. పోనీలెండి! వర్మ ఏదో చేసి మరేదో చూపించి 'సత్య'ని హిట్ చేయాలనుకున్నాడు. బహుశా ఆ 'చూపించడం' కోసమే సహకరించేందుకు వర్మ ఊర్మిళని మంచి చేసుకుంటూ ఈ 'భజన' మొదలెట్టాడని కొందరి గుసగుస!

-జె.వి.బాబు

వినడానికి వస్తే, మౌనంతోనే పొద్దుపుచ్చుతున్నారు'' తల పూర్తిగా ఎత్తకుండానే చురక అంటించింది.

చిన్నీ....

ఊ

నువ్వెప్పుడైనా గుడికి వెళ్లావా?

ఊ

ఎందుకు?

అమ్మతోడుగా రమ్మంటేనూ!

గుడిలో ఏమి చేశావు?

ఏం చేస్తాను? దణ్ణం పెట్టుకున్నాను!

ఎందుకు?

అమ్మ పెట్టమంది గనక!

ఇంక అక్కడితో సహనం నశించిపోగా అంది ''ఇందుకేనా పనికట్టుకొని పిలిపించింది? నేనెప్పుడైనా గుడికి వెళ్లానా? లేదా? వెళితే ఎందుకు వెళ్లాను? ఎవరితో వెళ్లాను? దేవుడికి ఏమని దణ్ణం పెట్టుకున్నాను? వగైరాలు తెలుసుకుందుకా?''.

భాస్కరం నవ్వేస్తూ అన్నాడు, ''నవ్వులాటకు కాదు చిన్నీ, సీరియస్‌గానే అడుగుతున్నాను చెప్పు''

''నేనూ సిన్సియర్‌గానే చెబుతున్నాను. అమ్మ పెట్టమంది గనక పెట్టాను. అంతే'' నవ్వు ఆపేస్తూ చెప్పింది జ్యోతి.


''నీలో నీకు ఇంకా ఓ స్పష్టమైన రూపం ఏర్పడలేదు కాబట్టి మీ అమ్మ చెప్పినట్లు చేశావు. సరిగ్గా నేను అంతే! నాలోని నాకు ఓ రూపాన్ని కల్పించుకుంటున్నప్పుడు, యాదృచ్ఛికంగానో లేక దైవికంగానో నాకు నువ్వు ఆలంబన అయ్యావు. నీకు మీ అమ్మ దారి చూపినట్లుగానే నాకు నా మనసు నిన్ను చూపించింది. క్రమంగా నన్ను నేను మలుచుకున్నాను. ఇందాకా అమ్మ తోడు రమ్మంది గనక గుడికి వెళ్లానని చెప్పావు చూడు, అందరూ అమ్మ చెప్పినందుకో నాన్న చెప్పినందుకో కాదు, నిర్మలమైన బుద్ధిని ప్రసాదించమని వేడుకోవడానికో, ప్రశాంతత కోసమో, లేక దైనందిన జీవితంలో దొర్లిన లోపాల్ని సరిదిద్దుకునే మానసిక సంకల్ప బలాన్నివ్వ మని వేడుకోవడానికో గుడికి వెళతారు.''

''ఎవరు ఏ గుడికి ఎందుకు వెళితే మనకెందుకు?''

''ఎందుకంటే, అందరూ వేటికోసం గుడికి వెళతారో ఆ ప్రశాంతతా, ఆత్మతృప్తీ నాకు నువ్వు కనపడినప్పుడు, నన్ను చూసి పలకరింపుగా నువ్వు నవ్వినప్పుడు, నాతో మాట్లాడినప్పుడు నాకు లభిస్తాయి.''

జ్యోతి విస్మయంగా వింటోంది.

''ఒక కళాకారునిగా నిరంతరం నాలోని సంఘర్షణ తట్టుకోలేనప్పుడు, నాకు నేనే సృష్టించుకున్న సమస్యల పరిష్కారాన్వేషణలో అలసిపోయినప్పుడు, హృదయాన్ని కన్నుల్లో ప్రతిఫలించుకుని దానిని కాన్వాసు పైకి ఎక్కించడానికి రంగులు కలుపుతున్నప్పుడు, అప్పుడు నువ్వు నా హృదయాంతరాళాల్లోంచి లేచి వచ్చి నాకు స్ఫూర్తినిస్తావు. నువ్వు నాలోంచీ నిష్క్రమిస్తే మిగిలేది శూన్యం.''




అతని మాటలు అర్థం అవుతున్న కొద్దీ ఆమెలో భావసంచలనం భరింపరానిదిగా మారుతోంది.

ఆది మధ్యాంత రహితుడై నిరంతరంగా సృష్టిలోని సకల చరాచర జీవరాశిలోనూ, చైతన్యం నింపే భాస్కరునికి కూడా అంధకారపు ఆ చూకీ తెలుసునా? ఆ వెలుగుల వేలుపు చేతి దీపంలా వెలిగేంతటి అదృష్టవంతురాలా తను? ఎన్ని జన్మల సుకృతమీ పురస్కారం?

తనకీ అతనికీ గల సంబంధం ఏమిటి? ఎలాటిది? ఎప్పటిది?

''ధవళ కాంతుల్ని విశ్లేషించి హరివిల్లును ఎక్కుపెట్టగల చిత్రకారుని చేతిలో నేనెరుగని కుంచెను, నేనా?''

అతి సాధారణమైన పదాల కూర్పుతో ఎంతటి గంభీరమైన భావాన్ని అయినా హృద్యంగా మనోయవనికపై ఆవిష్కరించగల పుంభావ సరస్వతి కలంలో సిరానై ప్రవహించడానికి నాకు గల అర్హత ఏపాటిది?''

అతని హృదయ పీఠంపై అధిష్టించడానికి తానతనికి ఏమౌతుంది గనుక? అయినా అతని గుండెల్లో తను పదిలమై పోయిందే!

ఎలా సంభవించిందీ అపూర్వ సంగమం! ఎలా సంఘటించిందీ అద్భుత సన్నివేశం? అతడు తనపై చూపుతున్న అవ్యాజానురాగం, ఆత్మీయత ఇవన్నీ తానింతవరకూ భావించినట్లుగా ప్రేమ లో మమైకం కావడం లేదే, ఎందుకు?

ఈ అనుభూతి ప్రేమ కంటే మధురంగా ఉందే.

అంటే, ప్రేమకు కూడా లొంగని విశిష్టమైన బాంధవ్యం మరొకటి ఉందా? ఉంటే, ఆ అమృత తుల్యమైన అనుభూతి ఇదేనా?

అతని శరీరంలోని అణువణువునూ శోధిస్తోంది. తనకోసం, అతని నిలువెల్లా నిండివున్న తన జాడలకోసం ఆర్తిగా గాలిస్తోంది.

ఏదో దివ్యశక్తి చేత ప్రేరేపించబడిన వాడిలా సమాధి స్థితి నుంచీ జ్ఞాన నేత్రాలు తెరిచి మంద్రంగా పలికాడు. ''చిన్నీ, జ్ఞానేంద్రియ పంచకానికి అతీతమైన ఒక దివ్య జ్యోత్స్న ఈ సృష్టినంతటినీ శాసిస్తూ ఉంటుందట, ఆ పరంజ్యోతిని నా కనుల ముందు సాక్షాత్కరింప జేసే నా జ్యోతీ..''

మళ్లీ ఆ గదిని అంధకారం అలుముకుంది. మళ్లీ నిశ్శబ్దం ఆవరించింది. అబ్బురంగా ఇంకా అలాగే చూస్తున్న ఆమె చూపులు బాల భానుని లేత కిరణాల్లా అతనిపై ప్రసరిస్తున్నాయి.

ఆ కరుణా కటాక్ష వీక్షణాలలో పునీతుడై...

అంతవరకూ ఆ ప్రదేశాన్ని ఆవరించి ఉన్న స్తబ్దతని పటాపంచలు చేస్తూ...

తన స్థానాన్నుంచీ పైకి లేచాడు భాస్కరం.

వాఙ్మయంలా జ్యోతిర్మయమై భాసిల్లుతున్న ఆమె ముందు మోకరిల్లాడు. మెల్లగా శిరసు వంచాడు.

ఆమె సంభ్రమంగా పరికిస్తోంది.


ఎలా స్పందించాలో తెలియని అయోమయం, ఏం చెయ్యాలో తెలియని బేలతనం ఒక్కసారిగా ఆమెను చుట్టుముట్టాయి.

అతడు పారవశ్యంగా ఆమె పాదాలు చుంబించాడు.

అతని శిరస్సుపై అమృతాభిషేకంలా, అశ్రుధారలు!

★

## రవీనా మాటలు



రవీనా టండన్ 'నేనూ సన్నీ డియోల్ మంచి స్నేహితులం మాత్రమే' అన్న స్టేట్‌మెంట్ ఇచ్చి చాలా కాలమయింది. ఆ మంచి ఫ్రెండ్స్ త్వరలో 'సలాఖే' చిత్రం కోసం 45 రోజులపాటు విదేశాలకు వెళ్తున్నారు. వాళ్లు మంచి స్నేహితులే కావచ్చేమోగాని డింపుల్ కపాడియాకు రవీనా మీద నమ్మకం లేదు. ఆమె సన్నీకి 'ఇక నీ చిత్రాల్లో రవీనా వుండడానికి వీల్లేదు' అంటూ హుకుం జారీ చేసింది. సన్నీ తల ఊపక తప్పలేదట. ఫలితంగా సుజిత్ కుమార్ అనే డైరెక్టర్ తన 'ఛాంపియన్' చిత్రం కోసం రవీనాను బుక్ చేసినవాడల్లా ప్రస్తుతం రవీనా బదులు మరో హీరోయిన్ కోసం వెతుకుతున్నాడని వినికిడి. అయితే ఇటీవల తన ఆనారోగ్యం కారణంగానే అలాంటి మార్పేదో జరిగివుంటుందని అంటోంది రవీనా.

-జె.వి.బాబు